క్లుప్తంగా

గ్రామీణ రహదారుల అభివృద్ధికి నిధులివ్వాలి



తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి సోమవారం పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని ఈఈ కార్యాలయంలో కలిసిన ఎమ్మెల్యే ఈ మేరకు రహదారుల సమస్యలను వివరించారు. సీసీ రహదారుల నిర్మాణ ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని కోరారు.

రూ.40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం



మూలపాడు(ఇబ్రహీంపట్నం): మండలం పరిధిలోని మూలపాడులో సిమెంటు రోడ్ల నిర్మాణానికి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గరిపాటి శ్రీదేవి సోమవారం భూమిపూజ చేశారు. గతంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఈ గ్రామంలో పర్యటించిన సమయంలో పలువురు మహిళలు సీసీ రోడ్ల సమస్య ఆయన దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. ఆయన సూచనల మేరకు జెడ్పీ నిధులు రూ.40లక్షలతో గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో 800 మీటర్ల పొడవున రోడ్లు నిర్మించనున్నట్లు ఆమె తెలిపారు. గ్రామానికి రూ.40లక్షల నిధులు మంజూరు చేసిన జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక, వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవికి గ్రామ సర్పంచ్ చింతల భూలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు

మునునూరు: ప్రతి ఉద్యోగికి బదిలీ ఓ మజిలీ అని, ప్రతి మజిలీలో తన సమర్థతను నిరూపించుకోవాలని వైస్ ఎంపీపీ రాజానాయన అన్నారు. లోపూడి ప్రాథమికోన్నత పాఠశాల్లో పనిచేస్తూ, ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా పాఠశాల నుంచి అంతర మండల పాఠశాలలకు, నూజివీడు, కైకలూరు, బంటుమిల్లి మండలాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వరరావు, గాంగేయుడు, పోతురాజు, సత్యప్రియ, రత్నమాలను సోమవారం హెచ్‌ఎం కేశవరెడ్డి అధ్యక్షతన తల్లిదండ్రుల కమిటీ సభ్యులు సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యుడు.వరికూటి ప్రతాప్, సర్పంచ్ పేరం కృష్ణ, ఎస్‌ఎంసీ చైర్మన్ చిమట ఏడుకొండలు పాల్గొన్నారు.

విశ్వకవికి ఘననివాళులు

మునునూరు: జాతీయ గీతం జనగణమన రచయిత, శాంతి నికేతన్ స్థాపకుడు, చిత్రకారుడు, విశ్వకవి రవీంద్రనాథ్‌ఠాగూర్‌కు పలు గ్రామాల్లో నివాళులర్పించారు. సోమవారం ఠాగూర్ వర్ధంతి సందర్భంగా పాఠశాలలు, కార్యాలయాల్లో ఆయనకు నివాళులర్పించారు. లోపూడి ఆశ్చర్య పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు.వరికూటి ప్రతాప్ పాల్గొని ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఉపాధ్యాయులకు సన్మానం



గానుగపాడు(తిరువూరురూరల్): మండలంలోని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఇరువురు ఉపాధ్యాయులను సోమవారం సన్మానించారు. ఉపాధ్యాయులు రాంబాబు, రామాచారిని సత్కరించి వారి సేవలను పలువురు తల్లిదండ్రులు అభినందించారు. పాఠశాల హెచ్‌ఎం ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు రాంప్రదీప్, సాయిరాం, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ ఇంజినీర్లకు అవకాశం

మైలవరం: ప్రభుత్వ, ప్రైవేట్ రంగ పరిశ్రమలలో నైపుణ్యం ఉన్న ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్లకు మంచి డిమాండ్ ఉందని ప్రామినెంట్ ఆలుమ్ని ఈఈఈ విద్యార్థి, ఆస్ట్రేలియా ష్నీడర్, ఎలక్ట్రిక్ గ్లోబల్ క్లస్టర్ డైరెక్టర్, కే వీరేంద్ర కుమార్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగం, అలుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో పరిశ్రమలలో ఉద్యోగావకాశాలు అనే అంశంపై సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఎలక్ట్రికల్ వెహికల్‌లో వచ్చిన విప్లవ నైపుణ్యం కలిగిన ఎలక్ట్రిక్ ఇంజినీర్లకు ఉత్తేజకరమైన కెరియర్ ఉందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే హరినాథరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఎలక్ట్రిక్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులకు డిమాండ్ ఉందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ జే శివవరప్రసాద్, అలుమ్ని కో–ఆర్డినేటర్ టి.అనిల్‌రాజు, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ కే లక్ష్మీలావణ్య పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



గొల్లపల్లి హైస్కూల్లో పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థినులు

నూజివీడు: గొల్లపల్లి హైస్కూల్లో జాతీయ చేనేత దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలు లక్ష్మి, తెలుగు ఉపాధ్యాయుడు రంగారావు మాట్లాడుతూ మన దేశ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేవి చేనేత వస్త్రాలేనన్నారు. ప్రతి ఒక్కరూ వారానికి ఒక్క రోజైనా చేనేత వస్త్రాలను ధరిస్తే చేనేత కార్మికులకు చేయూత ఇచ్చినట్లు అవుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రవీంద్ర, ఉపాధ్యాయులు లక్ష్మి, మనోహరం, రంగారావు, కోటేశ్వరమ్మ, విఠల్‌బాబు, సౌజన్య, కృష్ణవేణి, రవి పాల్గొన్నారు.

చేనేత కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి

మునునూరు: చేనేత కార్మిక సమస్యల పరిష్కారం కోసం అందరూ చేయూతనివ్వాలని జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం నూజివీడు నియోజకవర్గ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మల్లవల్లి కోటేశ్వరరావు, కూసం ధర్మారావు కోరారు. సోమవారం జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా నూజివీడు నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల నేతన్నలను కలసి, వారి సమస్యలు తెలుసుకునే కార్యక్రమానికి చెక్కపల్లి నుంచి శ్రీకారం చుట్టినట్లు వారు తెలిపారు. లోపూడి, చెక్కపల్లికి చెందిన కల్కిమూర్తి, మన్మధరావు, శోభనం, భావనారుషి పాల్గొన్నారు.

చేనేత దుస్తులకు ఆదరణ తగ్గలేదు

మైలవరం: యాంత్రీకరణతో ఎన్నో మార్పులు వచ్చినా చేనేతకు ఆదరణ తగ్గలేదని ప్రధానోపాధ్యాయులు పి. గోపాల్ తెలిపారు. మైలవరం ఆరో వార్డులోని ఎంపీపీ పాఠశాలలో జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.



చెక్కపల్లిలో మాట్లాడుతున్న చేనేత కార్మిక నేతలు



మైలవరం ఎంపీపీ పాఠశాలలో చేనేత ప్రాధాన్యతను వివరిస్తున్న హెచ్‌ఎం గోపాల్

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రయోజనాలు



గుంటుపల్లిలో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న ఎంపీపీ జోత్స్న, వైద్య సిబ్బంది

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఎన్నో ప్రయోజనాలు దాగున్నాయని ఎంపీపీ పాలడుగు జోత్స్న అన్నారు. గుంటుపల్లి అంబేడ్కర్ నగర్‌లో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో ఆమె పాల్గొని చిన్నారులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య వివరాలు తెలుసుకోవడంతో పాటు అవసరమైన మందులు ఇస్తున్నారన్నారు. ఇబ్రహీంపట్నం 14వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో కౌన్సిలర్ నల్లమోతు చిన్నారులకులక్ష్మీ టీకాలు వేశారు.

నేడు మండల సమావేశం

గంపలగూడెం: గంపలగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. సమావేశ మందిరంలో ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తగిన సమాచారంతో తప్పక హాజరు కావాలని తెలిపారు.

కమ్ములూరి బాబు రాజాకు డాక్టరేట్

ఆగిరిపల్లి (నూజివీడు): పోతవరప్పాడు ఎస్‌ఆర్‌ఐ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కమ్ములూరి బాబు రాజాకు ఆంధ్ర యూనివర్సిటీ విశాఖపట్నం నుంచి మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల చైర్మన్ ఆర్.వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రొఫెసర్ కె.వెంకట సుబ్బయ్య (వైస్ చాన్సలర్ జేఎన్‌టీయూ, గురజాడ, విజయనగరం) ఆధ్వర్యంలో బాబూరాజా చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్ వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సి.నాగభాస్కర్, అకాడమిక్ డైరెక్టర్ జి.సాంబశివరావు, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ జి.రోషయ్య పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

మైలవరం: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని స్మార్ట్ హోమ్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ సీఈఓ ఎస్.ప్రదీప్‌కుమార్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏఈ అండ్ డీఎస్ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ) అనే అంశంపై ఐదు రోజులు వర్క్‌షాపు సోమవారం ప్రారంభించారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌ను విద్యార్థులు తమ పాఠ్యాంశాలతో అనుసంధానించడం ద్వారా రాబోయే రోజుల్లో ఉండే పోటీని తట్టుకోగల సామర్థ్యతను సంపాదించుకోవచ్చన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డాటా సైన్స్(ఏఈ అండ్ డీఎస్) విభాగాధిపతి డాక్టర్ ఓ రమాదేవి మాట్లాడుతూ ఐఓటీ అనేది ఇప్పటి, రాబోయే ప్రముఖ సాంకేతిక విజ్ఞానములో అత్యున్నత ప్రాముఖ్యతను సంతరించుకొందన్నారు. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇప్పటి విద్యార్థులు అందిపుచ్చుకోవడం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులకు పరిశ్రమలతో అనుసంధానం కూడా అవసరమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు మాట్లాడుతూ కళాశాలలో నిర్వహిస్తున్న వర్క్‌షాపులను సద్వినియోగం చేసుకుని ఉద్యోగావకాశాలు పొందడానికి వినియోగించుకోవాలన్నారు.

జీవనోపాధి కోసం పలు పథకాల మంజూరు



మేకలు, గొర్రెలు పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

ఏ.కొండూరు: డ్వాక్రా సంఘాలకు జీవనోపాధి పెంపొందించుకునేందుకు ప్రభుత్వం పలు రకాల పథకాలు మంజూరు చేస్తుందని జెడ్పీటీసీ భూక్య గనియా పేర్కొన్నారు. మండల వెలుగు కార్యాలయంలో సోమవారం డ్వాక్రా గ్రూపు సభ్యులకు మంజూరైన గొర్రెలు, మేకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వల్లంపట్ల, కంభంపాడు, అట్లప్రగడ, ఏ.కొండూరు తండా, ఏ.కొండూరు గ్రామాల్లో స్వయం సహాయ సంఘాల లబ్ధిదారులకు ఎనిమిది యూనిట్ల మేకలను, రెండు యూనిట్ల గొర్రెలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. వీటిని జాగ్రత్తగా పెంచి జీవనోపాధి పెంచుకోవాలని సూచించారు. ఇవే కాకుండా బ్యాంకుల లింకేజీ రుణాలు, స్త్రీనిధి, ఉన్న తిపలు రకాల రుణాలు కూడా ప్రభుత్వం అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకుని తీసుకున్న రుణాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, వెలుగు ఏపీఎం ఆర్ సత్యం, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ కేఏఎస్ రవికాంత్, పశువైద్యాధికారి భరత్, డీపీఎం శోభారాణి, రాజేష్ పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

చాట్రాయి: ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం గర్భిణులు, బాలింతలకు ఎంతో దోహదపడుతుందని చనుబండ సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి అన్నారు. సోమవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సోమవారం పంపిణీ చేసిన కార్యక్రమంలో ఆమెతోపాటు ఎంపీటీసీ దార్ల సోనీ ఆనంద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

మణిపూర్ దాడులను నిరసిస్తూ శాంతిర్యాలీ

పుట్రేల (విస్సన్నపేట): మణిపూర్‌లో జరుగుతున్న దాడులను నిరసిస్తూ మండలంలోని పుట్రేల గ్రామంలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ ఆదివారం రాత్రి నిర్వహించారు. మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న హింసాత్మక చర్యలను అరికట్టాలని డిమాండ్ చేశారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం



గంపలగూడెంలో తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గంపలగూడెం: బిడ్డకు ఏడాది వయస్సు వచ్చే వరకు తల్లిపాలు తప్పక పట్టాలని అంగన్‌వాడీ కార్యకర్తలు సూచించారు. గంపలగూడెం ఎన్టీఆర్‌కాలనీ 66వ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవ సందర్భంగా సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాల వలన ప్రయోజనాలను కార్యకర్తలు వివరించారు.

బిడ్డకు తల్లిపాలను మించిన ఔషధం లేదు

నూజివీడు: బిడ్డకు తల్లిపాలను మించిన ఔషధం లేదని ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్వై నూరాని అన్నారు. పట్టణంతోపాటు మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. పలు కేంద్రాలను సందర్శించిన సీడీపీఓ మాట్లాడుతూ తల్లిపాల ప్రాధాన్యతను తెలపడానికే తల్లిపాల వారోత్సవాలను నిర్వహించినట్లు పేర్కొన్నారు.

ముగిసిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

ఇబ్రహీంపట్నం: నిమ్రా వైద్యశాల ఆధ్వర్యంలో ఈ నెల ఒకటో తేదీ నుంచి జరిగిన అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో నిమ్రా వైద్య కళాశాల డీన్ ఫారూఖ్ మాట్లాడుతూ ప్రతిబిడ్డకు తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందన్నారు. వారోత్సవాల్లో తల్లిపాల గురించి అవగాహన కల్పించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డాక్టర్ శివరంజన్ పాల్గొన్నారు.

సీఈఓలకు ఘన సన్మానం



సీఈఓలను సన్మానిస్తున్న చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు

గంపలగూడెం: గంపలగూడెం మండలం కొణిజెర్ల, ఊటుకూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల సీఈఓ సుభాని, అనంత వెంకట నరసయ్యకు సోమవారం ఘన సన్మానం లభించింది. ఆప్కాబ్ డైమండ్ జూబ్లీ వేడుకల సందర్భంగా 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఉన్నత సేవలకుగాను ఉమ్మడి కృష్ణాజిల్లాలో కొణిజెర్ల, ఊటుకూరు పీఏసీఎస్‌లకు మొదటి రెండు స్థానాల్లో బెస్ట్ సొసైటీ అవార్డు వచ్చింది. దీంతో గంపలగూడెం కేడీసీసీ బ్యాంకులో మండలంలోని పీఏసీఎస్ సీఈఓలు, బ్యాంకు అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఆ సొసైటీలకు చెందిన ఇరువురు సీఈఓలను సన్మానించారు. ఈ సందర్భంగా బ్యాంకు చీఫ్ మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు మాట్లాడుతూ సొసైటీల సిబ్బంది సభ్యులు అవసరాలు తీర్చే విధంగా పనిచేయాలన్నారు. మేనేజర్ కనకదుర్గ, సూపర్‌వైజర్ ఏసోబు, మంగలక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల కేంద్రం పునరుద్ధరణ

తిరువూరు: పట్టణంలో విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాన్ని ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులు పునరుద్ధరించారు. లక్ష్మీపురం విద్యుత్ సబ్ స్టేషను ఆవరణలో నూతన భవనాలు నిర్మించిన అనంతరం రెండు నెలల క్రితం ఇంజినీరింగ్ అధికారుల కార్యాలయాలతో పాటు విద్యుత్ రెవెన్యూ కార్యాలయం, విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలను కూడా అక్కడికి తరలించారు. దీంతో అత్యధిక విద్యుత్ సర్వీసులున్న తిరువూరు పట్టణ వినియోగదారులు బిల్లుల చెల్లింపునకు మూడు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తున్నందున పట్టణ పరిధిలోనే ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. ఈ మేరకు సోమవారం నుంచి బిల్లుల వసూలు కేంద్రాన్ని ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో ప్రారంభించినట్లు ఏఈ షఫీ తెలిపారు.

ఉనికిని కాపాడుకునేందుకే టీడీపీ దాడులు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఇబ్రహీంపట్నం: ప్రజల్లో ఉనికిని కాపాడుకునేందుకే టీడీపీ నాయకులు పుంగనూరులో పోలీసులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, పార్టీ నాయకుడు పాలడుగు దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం టీడీపీ దాడులను ఖండించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కులం, మతం, పార్టీ, ప్రాంతం చూడకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై రోజురోజుకు ప్రజల్లో పెరుగుతున్న అభిమానం చూసి మాజీ సీఎం చంద్రబాబు జీర్ణించుకోలేక దాడుల పన్నాగం పన్నారన్నారు. దుర్గగుడి పాలకవర్గ సభ్యుడు చింకా శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్లు గాంధీ, జానీ, చిట్టిబాబు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ దయాసాగర్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతో రక్తహీనత దూరమవుతుందని కొండపల్లి 5వ వార్డు కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో గర్భిణులకు టేక్ హోమ్ రైస్ పంపిణీ చేశారు. ప్రభుత్వం అందించే ఆహార పదార్థాలతో చిన్నారుల్లో వ్యాధినిరోధక శక్తిపెరిగి సంపూర్ణ ఆరోగ్యంతో పెరిగేందుకు దోహదపడతాయన్నారు.

'నా భూమి–నా దేశం' విజయవంతం చేద్దాం

చాట్రాయి: నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని ఎంపీపీ లంకా నిర్మల అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నా భూమి–నా దేశం కార్యక్రమంపై సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 9 నుంచి నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో దుర్గా ప్రసాద్, ఏపీవో లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

అలజడి సృష్టించడమే చంద్రబాబు ధ్యేయం

తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి, పక్కన నాయకులు

తిరువూరు: ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అలజడులు సృష్టిస్తున్నారని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి విమర్శించారు. స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ అధినేత చేసిన హంగామా ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ప్రజాదరణ కోల్పోయి, కుప్పంలో సైతం ఓడిపోయే స్థితిలో ఉన్న చంద్రబాబు వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. విలేకరుల సమావేశంలో తిరువూరు, విస్సన్నపేట జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, లోకేశ్వరరెడ్డి, తిరువూరు పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చలమాల సత్యానారాయణ, వార్డు కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, ఏరువ ప్రకాష్‌రెడ్డి, గుంటూరు మస్తాన్, మూడు దుర్గారావు పాల్గొన్నారు.

మయూర్ జ్యూయలర్స్ ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు



ఫ్రెండ్‌షిప్ డే వేడుకల్లో పాల్గొన్న వినియోగదారులు

ఇబ్రహీంపట్నం: మయూర్ జ్యూయలర్స్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఏకాలనీ శ్రీవెంకటేశ్వర కళ్యాణ మండపంలో వినియోగదారుల కోసం ఫ్రెడ్‌షిప్ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆటలు, పాటల పోటీలు, యాంకరింగ్ తదితర ప్రోగ్రాంలు ఏర్పాటు చేశారు. పోటీల్లో గెలిపొందిన వారికి మయూర్ జ్యూయలర్స్ అధినేత భరత్‌జైన్ బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2001 నుంచి తమ షాపులో మైమరిపించే ఆభరణాలు నాణ్యత నమ్మకంతో వినియోగదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల కోసం రానున్న రోజుల్లో ఇటువంటి వేడుకలు నిర్వహిస్తామన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి



చెర్వుమాధవరంలో చిన్నారికి టీకాను వేస్తున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ, డాక్టర్ శ్రీ కల్యాణి

జి.కొండూరు: శిశుమరణాలు తగ్గిపోవాలంటే గర్భిణులు, చిన్నారులకు తప్పనిసరిగా క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మండల పరిధి చెర్వుమాధవరంలో సోమవారం నిర్వహించి మిషన్ ఇంద్రధనస్సు 5.0 కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నారులకు ఎంపీపీ చేతులమీదుగా టీకాలను వేశారు. మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకల్యాణి మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా ఇంటింట సర్వే నిర్వహించి టీకాలను వేయించుకోని గర్భిణులు, చిన్నారులను గుర్తించి వారికి టీకాలను వేస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలోని వైఎస్సార్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లలో ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు ఈ టీకాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ప్రతిఒక్కరూ సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

పైడూరుపాడులో..

పైడూరుపాడు(విజయవాడరూరల్): ఇంద్రధనస్సు హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో సోమవారం పైడూరుపాడు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు వేశారు. గ్రామ సర్పంచ్ వేముల సీతారామయ్య, ఎంపీటీసీ సభ్యురాలు బయ్యారపు కల్పన, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ డాక్టర్ రవికిషోర్, కొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ హెల్త్ ఆఫీసర్ శిరీషా, ఎంఎల్‌హెచ్‌వీ మాధవి, ఏఎన్‌ఎమ్ నాగలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ పార్వతి పాల్గొన్నారు.

నేలలో జీవ వైవిధ్యం పెరుగుతుంది



విత్తనాలను అందజేస్తున్న ఎంపీపీ శిరీష

నూజివీడు: నవధాన్యాలు సాగుచేయడం వల్ల భూమిలో జీవ వైవిధ్యం పెరగడంతో పాటు కర్బన సారం పెరిగి భూసారం పెరుగుతుందని, తద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని ఎంపీపీ ఆరేపల్లి శిరీష పేర్కొన్నారు. మండలంలోని తుక్కులూరులో సోమవారం ఏపీ కమ్యూనిటి మేనేజ్డ్ ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్‌ఎఫ్) ఆధ్వర్యంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మండలంలోని 135 మంది ఎస్సీ రైతులకు నవధ్యానాలు, కూరగాయల విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ వీటిని సాగు చేయడం వల్ల భూమిలో వానపాములు సైతం వృద్ధి చెంది పంటల దిగుబడికి దోహదపడతాయన్నారు. వ్యవసాయాధికారి చాముండేశ్వరి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మళ్లించడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయన్నారు. ఎస్సీ కార్పోరేషన్ ఈఓ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు గాను రైతులకు ఒక్కొక్కరికి రూ.9,500 విలువ చేసే కిట్లను అందజేస్తున్నామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 821 మంది ఎస్సీ రైతులకు ఈ కిట్లను అందిస్తున్నామన్నారు. అనంతరం ఎస్సీ రైతులకు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బుజ్జి పాల్గొన్నారు.